# కొత్త రచయితలు



## గుర్రమెక్కించండి

ఆడిటోరియం కిటకిటలాడి పోతున్నది. జనం ఇసకవేస్తే రాలనట్లున్నారు. అవధానం జోరుగా సాగుతోంది. అవధానిగారు పట్టుపీతాంబరాలు ధరించి,కాశ్మీరు శాలువా కప్పుకున్నారు. ఆయన చెయ్యూపుతూ పద్యం చదువుతుంటే శాలువా అంచుపైకి జరిగి గుమ్మడికాయ లాంటి బొజ్జ బైటికి తొంగి చూస్తున్నది. ముఖానికి అందాన్నిచ్చే చిరునవ్వుతో నుదుట నామంతో ఓవిధమైన తేజస్సుతో అవధానిగారు వెలిగిపోతున్నారు. వేదికమీద పృచ్ఛకులంతా గుంటనక్కల్లా కాచుక్కూర్చున్నారు.

ఓ పృచ్ఛకుడు అవధానిగారిని బాగాఇరకాటంలో పెట్టాలని నిర్ణయించుకొని గంభీరంగా అడిగాడు.

'అవధానిగారూ! ప్రక్క ఊరిలో పెళ్లికొడుకు గుర్రమెక్కాడట. ఎంత బ్రతిమాలినా దిగటం లేదట. అవతల ముహూర్తం ముంచుకొస్తూంది. మరి పెళ్లికొడుకు గుర్రం దిగేదెలా? ఆ పెండ్లిజరిగేదె ?'

అవధానిగారి ముఖంలోని చిరునవ్వు చెదరలేదు. అయితే ఆయనకు అది నల్లగుర్రమా, తెల్లగుర్రమా అని అనుమానం వచ్చినట్లుంది. అయినా గుర్రమెక్కిన తర్వాత అది నల్లదయినా, తెల్లదయినా తేడా ఏముందిట? ఇంతలో శ్రోతల్లోంచి ఓగడుగ్గాయి కేక వెయ్యనే వేశాడు—

'ఏంటి అవధానిగారు కూడా గుర్రమెక్కే మూడ్‌లో పడిపోయారా? ఉలిక్కిపడ్డారు అవధానిగారు. షేక్ చేసి మూతలాగిన సీసాలోంచి తన్నుకొచ్చే బీర్‌లా సమాధానమేదో తన్నుకొస్తోంది. శాలువా కొంచెం సరిచేసుకొని.

'గుర్రమెక్కిన పెళ్లికొడుకు ఎటూ కిందికి దిగడు. ముహూర్తం మించి పోకుండా పెళ్లి జరిగిపోవాలంటే పెళ్లికూతుర్ని వెంటనే గుర్రమెక్కించేయండి, పెళ్లి జయప్రదంగా జరిపించేయండి.'

అంటూ అవధానిగారు సమాధానం ముగించేసరికి

హాలుహాలంతా కరతాళధ్వనులతో మారుమ్రోగిపోయింది. అవధానిగారి అవధానానికి తిరుగులేదన్న నిజం తెలిసి తిక్క ప్రశ్నలడిగే పృచ్ఛకుల తలలు వాలిపోయాయి. ○

—హిమజారమణ

## కొత్తల్లుడు

'ఏమండీ..! పండగ వస్తోంది. అమ్మాయి భార్గవి పెళ్లయి సంవత్సరం అవుతోంది. ప్రేమించి పెళ్లిచేసుకున్నంత మాత్రాన దాన్ని ఇలావదిలేయడం ఏం బాగాలేదు. ఈ సారైనా దాన్ని పిలుద్దామండీ!' అంది శారద.

'ఉన్నదంతా పెద్దల్లుళ్లే పీక్కు తింటున్నారు.. . మూడో అల్లుణ్ణి కూడా పిలిస్తే ఏం పెడతాం మనం?' కోపంగా అన్నాడు వాసు.

పరమేశ్వరరావుగారు ఆవేదనగా కొడుకు వంక చూశారు. ఈ ఆడపిల్లల బాధ్యతలతో, తన తల్లి రోగాలతో అప్పుల్లో సగం మునిగి వున్న తను వాసు గురించి, వాడి బాగోగులగురించీ అసలు పట్టించుకోలేదు. పాపం... ఏం తిన్నాడో... ఏం కట్టుకున్నాడో! 'నాన్నా! నాకిదికావాలి' అని నోరుతెరిచి ఏదీ, ఏనాడూ అడగలేదు. ఇంటి పరిస్థితి గురించి ఆలోచించి ఇంజనీరింగ్ లో చేరాలనుకున్న తన కోరికను అణిచిపెట్టుకొని డిగ్రీలో చేరాడు.

పదిమంది పిల్లల్ని పోగుచేసి ట్యూషన్లు చెప్తూ 'నాన్నా! ఈ డబ్బు ఉంచండి అంటూ పాతికో, పరకో తనకిస్తుంటే కొడుకు ఎంత ప్రయోజకుడో అని మురిసిపోయాడే కానీ ఏనాడూ వాడి భవిష్యత్ గురించి ఆలోచించలేక పోయాడు.

'ఈసారి పెద్దల్లుళ్లనిద్దరినీ పిలవకుండా, మూడో అక్కని, బావగారినీ పిలుద్దాం... ఏమంటారు నాన్నా!' అన్నాడు వాసు.

శారద కల్పించుకుంటూ 'వాళ్లను పిలవకుండా వీళ్లని పిలిస్తే బాగుండదురా... ఏమన్నా అనుకుంటారు' అంది.

'ఏమనుకుంటే అదే అనుకుంటారు... మనం మర్యాదలు చేసిన కొద్దీవాళ్లదొక హక్కుగా వచ్చిపోతున్నారు...ఎన్నాళ్లిలా చేస్తాం అమ్మా...! నాన్నగారు రిటైరయ్యారు. నా చదువుకూడా ఇంకా పూర్తికాలేదు. ఉన్నదంతా వీళ్లకోసం అమ్ముకుంటే తరువాత మనం ఎలా బ్రతుకుతాం

కొడుకు మాటలు విన్న పరమేశ్వరరావుగారు భార్యతో 'శారదా! చిన్నవాడైనా వాడికున్న ఆలోచన నీకు లేకపోయింది... ఏది ఏమైనా ఈసారి వాసు చెప్పినట్లే చేద్దాం' అన్నారు సాలోచనగా.

పండగ ఇంకా వారంరోజుల్లో ఉందనగా పరమేశ్వరరావుగారి పేరుతో ఓ ఉత్తరం వచ్చింది.

గౌరవనీయులైన మామగారికి,

మీ మూడో అల్లుడు నీలేష్ నమస్కరించి